క్లుప్తంగా

నేడు ఉరుకుందలో రుద్ర హోమం



ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఆదివారం రుద్ర హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. హోమంలో పాల్గొనదలచిన వారు ముందుగానే రూ.1500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఆసక్తి కల్గిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు. హోమంలో పాల్గొనే భక్తులకు దేవస్థానం తరుపున శేషవస్త్రం, రవిక, స్వామివారి ఫొటో, దేవస్థానం పేరున్న బ్యాగ్, దేవస్థానం లడ్డు బాక్స్‌లో రెండు లడ్డు ఉంచి ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ఆంజనేయస్వామికి అభిషేక పూజలు



కౌతాళం: మండలంలోని అంజనేయ స్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయ స్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. కౌతాళంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజల్ని చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



భీష్ముడి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: స్థానిక అంబాభవాని ఆలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశిని నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సభ్యులు భీష్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు తెలుగు ఈరన్న, బేల్దారు శ్రీనివాసులు, ఆటో వెంకటేష్, మేఘనాథ్, దుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


నీళ్ల ట్యాంకు శుభ్రం



నీళ్ల ట్యాంకును శుభ్రం చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని తాగునీటి పెద్ద ట్యాంకును శనివారం శుభ్రం చేశారు. ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి స్వచ్ఛమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి శివప్ప తెలిపారు. గ్రామంలో ప్రధాన ట్యాంకు కావడం ఈ ట్యాంకు నుంచి గ్రామంలోని 80శాతం నీరు సరఫరా చేయాల్సి ఉండడంతో దీనిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు, ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: 27 సంవత్సరాల తరువాత ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోఎమ్మెల్యే పార్థసారథి ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి కోట్ల కూడలి, పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. అదేవిధంగా అక్కడి నుంచి ప్రధాన రహదారుల్లో ఆలయానికి చేరుకుంది. ముందుగా అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు

చేయూత లభించేనా.?

- ఏడాదిగా స్తంభించిన ఏడాదిగా టౌన్‌బ్యాంక్ సేవలు
- రుణాలు అందక పేదల అవస్థలు
- కొలువుదీరిన టౌన్‌బ్యాంక్ నూతన పాలకవర్గం
- ఇప్పటికైనా ఆదుకుంటుందేమోనని వ్యాపారుల ఆశాభావం



ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు

ఎమ్మిగనూరు: చిన్న, మధ్యతరగతి వ్యాపారాలకు చేయూతనిస్తూ దశాబ్దాలుగా ప్రజా బ్యాంకుగా పేరుగాంచిన టౌన్‌బ్యాంకు సేవలు ఏడాదిగా స్తంభించాయి. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పాలకవర్గం ఏర్పాటు చేయటం ఆలస్యం కావడంతో సామాన్యుడికి బ్యాంకు సేవలు దూరమయ్యాయి. కాగా, నూతన పాలకవర్గాన్ని నియమించడం, వారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించడంతో ఇప్పటికైనా చేయూత లభిస్తుందేమోనని చిరువ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే స్థాపితం

స్వాతంత్ర్యానికి పూర్వమే 1946లో ఎమ్మిగనూరులో కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకును పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించారు. రూ.3వేలు మూలధనంతో 33 మంది సభ్యులతో ఏర్పాటైన బ్యాంకు అంచలం చెలుగా వృద్ధిలోకి వచ్చింది. టౌన్‌బ్యాంకు ఏర్పాటు కాక మునుపు ఎమ్మిగనూరులో వారం వడ్డీ వ్యాపారుల చేతిలో చేనేతలు, చిరు, మధ్యతరగతి వ్యాపారులు నలిగిపోతుండేవారు. టౌన్ బ్యాంకు ఏర్పాటుతో చేనేత రంగం, సహకార రంగం వృద్ధిలోకి వచ్చాయి. అనంతరం భారతీయ స్టేట్ బ్యాంకు ఏర్పాటైనప్పటికీ స్థానిక వ్యాపారాలకు టౌన్‌బ్యాంకు లావాదేవీలే కీలకంగా ఉన్నాయి.

దినదిన ప్రవర్ధమానం..

ఎమ్మిగనూరు టౌన్‌బ్యాంకు సేవలు దశాబ్దాలుగా ఎమ్మిగనూరు పట్టణ, గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. రూ.3వేల మూలధనంతో మొదలై నేడు 15వేల మంది సభ్యులతో రూ.32కోట్ల టర్నోవర్‌కు చేరింది. రూ.16కోట్లు డిపాజిట్లు, రూ.11కోట్లు రుణాల టర్నోవర్ ఉంది. బ్యాంకుకు రూ.8కోట్లు సొంత ఆస్తులు ఉన్నాయి. ప్రస్తుతం బ్యాంక్‌లో సెక్యులర్‌లోన్‌ల కింద వ్యాపార, హౌసింగ్, క్యాష్‌క్రెడిట్, చిన్న వ్యాపార, బంగారం తనఖా లోన్లు ఇచ్చేవారు. చేయూత లోన్ల కింద షూరిటీ, శాలరీ, వెహికల్, గృహోపకరాల కొనుగోలు ఇచ్చేవారు. ప్రస్తుతం సెక్యూర్‌లోన్‌లు 13శాతం వడ్డీతో, గోల్డ్‌లోన్‌లు 11శాతం వడ్డీతో, చేయూత లోన్లు 10శాతం వడ్డీతో ఇస్తున్నారు. అయితే పాలకవర్గం లేక ఏడాదిగా ఈ సేవలన్నీ నిలిచిపోయాయి.

అంతా ఇన్‌చార్జ్‌ల పాలనే..

ఎమ్మిగనూరు టౌన్‌బ్యాంకు నిర్వాహణ ఆదినుంచి ఇన్‌చార్జ్‌ల పాలనలో కొనసాగుతోంది. 1994లో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పాలక వర్గం ఏర్పాటు కావడం మినహా మిగిలిన కాలమంతా ఇన్‌చార్జ్‌ల పాలనే నడిచింది. కొంతకాలం నామినేటెడ్ పాలనను కొనసాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకూ డీసీఓ శశిరేఖ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పాలకవర్గం ఏర్పాటుకాక పోవడంతో చేయూతలోన్లు ఇచ్చేవారు కరువయ్యారు. చిన్నవ్యాపారులకు, వెహికల్‌లోన్లు, శాలరీలోన్లు, గ్రూపులోన్లు ఇవ్వాటంటే పాలకవర్గం ఆమోదం తప్పనిసరి. కానీ పాలకవర్గమే లేకపోవడంతో చేయూతలోన్లు ఇవ్వడం మానేశారు. సుమారు రూ.5.17కోట్లు(16.5శాతం ఎన్‌పీలు) రుణాలు రికవరీ కావాల్సి ఉంది. చిరువ్యాపారులు కొత్త పాలకవర్గంపై ఆశలు పెట్టుకొన్నారు.

ఏడాదిగా రుణాలు ఇవ్వడం లేదు



టౌన్ బ్యాంక్‌కు పాలక వర్గ నియామకం లేక పోవడంతో ఏడాదిగా ఖాతాదారులకు, లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయడం నిలిచిపోయింది. బ్యాంక్‌కు స్పెషల్ ఆఫీసర్ ఉన్నప్పటికీ రుణాలు మంజూరు చేయలేదు. దీంతో పేదలు రుణాల కోసం బ్యాంక్ చుట్టూ తిరిగినా లాభం లేకపోయింది. నూతన పాలక వర్గం రుణాల మంజూరును పునరుద్ధరించాలి.

– సయ్యద్‌వాంద్, టౌన్‌బ్యాంక్ మాజీ డైరెక్టర్, ఎమ్మిగనూరు

మెరుగైన సేవలందిస్తాం



టౌన్‌బ్యాంకు పరిధిలో వున్న షేర్ హోల్డర్స్, చిరువ్యాపారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం. గతంలో ఇదే బ్యాంకు చైర్మన్‌గా పనిచేసిన అనుభవం, ఎమ్మెల్యే డాక్టర్ బి.జయనాగేశ్వర్‌రెడ్డి సహకారంతో బ్యాంకు సేవలను విస్తృతం చేసి లాభాల బాటలో నడిపించేందుకు తగు నిర్ణయాలు తీసుకుంటాం.

– ప్రతాప్ ఉరుకుందయ్యశెట్టి, టౌన్‌బ్యాంక్ చైర్మన్, ఎమ్మిగనూరు

కొలువుదీరిన పాలకవర్గం

ఎమ్మిగనూరు కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్‌కు నూతన పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా వ్యాపార వేత్త ప్రతాప్ ఉరుకుందయ్యశెట్టి, వైస్ చైర్మన్‌గా బి.నర్సప్ప, డైరెక్టర్లుగా ఎం మహబూబ్‌బాషా, యూ.రవికుమార్, డి భీమేష్, వి.రాజు,ఓ వెంకటేశ్వరరెడ్డి,కే సలాం, టి నరసింహులు, ఏ.నవీన్‌కుమార్, జి వెంకటగిరి బాధ్యతలు స్వీకరించారు.

వేసవిలో నీటిఎద్దడి నివారణకు చర్యలు



ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ

ఆదోని టౌన్: వేసవికాలం దృష్ట్యా ఆదోని డివిజన్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ తెలిపారు. శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఆదోని డివిజన్‌లో 14 మండలాలు, 415 గ్రామాలు ఉన్నాయని తెలిపారు. తాగునీటి ఎద్దడి నివారణ కోసం రూ.3 కోట్లతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. 24 గ్రామాల్లో చేతిపంపులు, బోర్ల మరమ్మతులు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే తుంగభద్ర దిగువ కాలువలో ప్రవహిస్తున్న రా వాటర్‌తో 12 ఎస్ఎస్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపినట్లు తెలిపారు. మిగిలిన 12 స్కీంల్లో 85 శాతానికి పైగా నీటిని నింపడం జరిగిందన్నారు. హాన్వాల్, హెబ్బటం, ఆస్పరి, ఎల్లార్తి, ఖాజీపురం, నేమకల్, చింతకుంట హెడ్ వర్క్స్, బాపురం హెడ్ వర్క్స్, విరుపాపురం హెడ్ వర్క్స్, గొనెగండ్ల, పెద్దకడబూరు, గుడికల్ ఎస్ఎస్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపినట్లు తెలిపారు. హెబ్బటం స్కీంకు సంబంధించి పంపుసెట్ కొనుగోలుకు టెండర్లు పిలిచామని చెప్పారు.

చివరి గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యం

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని ఈఈ తెలిపారు. నీటి సరఫరా, ఎస్ఎస్ ట్యాంకుల సరఫరాపై మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. స్కీంల పరిధిలో చివరి గ్రామాలకు తాగునీటిని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 45 గ్రామాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఆదోని మండలంలో 9, కౌతాళంలో 6, ఆస్పరిలో 4, మంత్రాలయంలో 2, హొళగుందలో 3, కోసిగిలో 3 గ్రామాల్లో నీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేయనున్నామన్నారు. అందులో ప్రధానంగా 24 గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. 96 బోర్లలో ఫ్లెస్సింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్కడ ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి



బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈఓ-2 శోభరాణి, హెచ్ఎం ఖలీల్ అహ్మద్

కోసిగి: సెలవుల్లోనూ 10వ తరగతి స్పెషల్ క్లాస్‌లు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ-2 శోభరాణి వంట ఏజెన్సీలకు సూచించారు. రెండవ శనివారం పాఠశాలలకు సెలవులు కావడంతో 10వ తరగతి విద్యార్థులను నిర్వహిస్తున్న స్పెషల్ క్లాస్‌లను పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్‌తో కలిసి తనిఖీ చేశారు. కోసిగి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రత్యేక తరగతులు పకడ్బందీగా కొనసాగించాలన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు క్లాసులు కొనసాగించి విద్యార్థుల సందేహాలను నివృతి చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఉత్తీర్ణులు అయ్యేలా తీర్చిదిద్దాలన్నారు. అలాగే యథావిధిగా మెనూ ప్రకారం రాగి జావాతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఆదివారం కూడా క్లాస్‌లు నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లో వాటా ఇవ్వాల్సిందే

ఆదోని రూరల్: జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌లో తమకు రావాల్సిన 11 శాతం వాటా కచ్చితంగా కేటాయించాల్సిందేనని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎస్.బాలన్న మాదిగ, పి.ఎస్.వీరేష్ మాదిగ, ఎం.జగన్ మాదిగ, పట్టణాధ్యక్షుడు గుమ్మల బాలస్వామి మాదిగ, మణికంఠ డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలోని మున్సిపల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను సాధించే క్రమంలో ఒక్క శాతం రిజర్వేషన్ కూడా కోల్పోవడానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఇష్టపడరన్నారు. ఇవ్వాల్సిన 11 శాతం రిజర్వేషన్‌లలో 9 శాతం మాత్రమే ఇచ్చి 2 శాతం రిజర్వేషన్ హరించి వేస్తామంటే ప్రభుత్వంపై యుద్ధం చేసి తిరిగి తెచ్చుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు దిబ్బనకల్లు ఉసేనప్ప, లోకదల్ గణేష్, దత్తు, రాయ్‌నగర్ మధు, విజయ్ కుమార్, హుసేని తదితరులు పాల్గొన్నారు.

ఎస్.నాగలాపురంలో ఓపెన్ కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎస్.నాగలాపురం గ్రామంలో శ్రీ దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు రాజు, నాగేష్, హరి, వీరేంద్ర శనివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 10,116, రెండో బహుమతి రూ. 5,016, మూడో బహుమతి రూ. 2,016 అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు ఆదివారం సాయంత్రంలోగా రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90007 40534, 93903 40253 నంబర్లకు సంప్రదించాలన్నారు.

11 నుంచి జిల్లా స్థాయి గిరక బండి పోటీలు

ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని 11వ తేదీ నుంచి జిల్లా స్థాయి గిరక బండి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు రాజేష్, జశ్వంత్, నాయుడు, జయకృష్ణ, అరవింద్ శనివారం తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ. 15,116, రూ. 10,116, రూ. 5,016, రూ.30116 అందజేస్తారు. పోటీలోల పాల్గొనే వారు 11వ తేదీ లోపు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 62819 62107, 80965 58151లకు నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

‘హృదయ రాగాలు’ పుస్తకావిష్కరణ



పుస్కకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన హృదయ రాగాలు 63వ పుస్తకాన్ని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఉప కులపతి ఆచార్య వెలదండ నిత్యానందరావు, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, జింక సుబ్రహ్మణ్యం, ప్రసిద్ధి తెలుగు సినీ నటుడు శివకృష్ణ చేతుల మీదుగా కడపలోని ఐఎంఏ హాల్‌లో శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఈ పుస్తకాన్ని యల్లాప్రగడ నరసింహసాయికి అంకితమిచ్చారు. 6 వసంతాల కాలంలో 63 పుస్తకాలు రచించి పలుచోట్ల అవిష్కరించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న గద్వాల సోమన్నను సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువులబాబు, కవి, కళాకారుడు కేవీ నాగేశ్వరయ్య, కొప్పుల ప్రసాద్, జహీర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్: బైకు ఎద్దుల బండిని ఢీకొనడంతో మండలంలోని మదిరె గ్రామానికి చెందిన బసప్ప గాయాలపాలయ్యాడు. ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన మేరకు వివరాలు .. మదిరె గ్రామానికి చెందిన ఎద్దులబండి పెద్దహరివాణం గ్రామం వైపు వెళ్తుండగా మదిరె గ్రామ సమీపంలో ఆ గ్రామానికి చెందిన బసప్ప బైకుపై వెళ్తూ వెనుక నుంచి ఢీకొన్నాడు. గాయపడిన బసప్పను స్థానికులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన నసీమా అనే మహిళ కడుపు నొప్పి తాళలేక శనివారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అవుట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలు.. కొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్న నసీమా జీవితంపై విరక్తిచెంది ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పొలానికి కొట్టే పురుగుల మందులు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్లాట్ ఫామ్-1లో ఎస్ఎస్‌సీ కార్యాలయం ఎదురుగా రాత్రి మృతి చెందిందని చెప్పారు. మృతురాలి వయస్సు 65 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని వెల్లడించారు. సదరు మృతిరాలుపై ఎవరికైనా సమాచారం తెలిస్తే స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

గడ్డివామి దగ్ధం

మంత్రాలయం : మండలంలోని చిలకలడోణ గ్రామంలో మాజీ ఎంపీటీసీ గోవిందమ్మకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. శక్రవారం గ్రామ శివారులో ఉన్న గడ్డివామి నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఎమ్మిగనూరుకు చెందిన ఫైర్ ఇంజిన్, సిబ్బంది వచ్చి మంటలలను పూర్తిగా ఆర్పేశారు. అయితే అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిబూడైంది. పశువుల కోసం నిల్వ చేసుకున్న గడ్డివామి దగ్ధం కావడంలో మేతలేకుండా పోయిందని బాధితురాలు వాపోయింది. అధికారులు స్పందించి పశువుల మేతను అందించాలని కోరారు.

23న మాలల యుద్ధ గర్జన

ఆదోని రూరల్: ఈనెల 23న కర్నూలులోని ఎస్టీబీసీ కాలేజ్ గ్రౌండ్‌లో రాయలసీమ మాలల యుద్ధ గర్జన నిర్వహిస్తున్నట్లు మాలమహానాడు పట్టణాధ్యక్షుడు బొబ్బిలి తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో శనివారం రాయలసీమ మాలల యుద్ధ గర్జన పోస్టర్లను విడుదల చేశారు. సభకు అత్యధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రంగన్న, ఎద్దుల నరసన్న, కె.సి.వీరేష్ బాబు, డిష్ గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న సీఐ మంజునాథ్

కోసిగి: లైసెన్స్ వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కోసిగి సీఐ మంజునాథ్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం స్థానిక మౌంట్ కార్మెల్ స్కూల్ సమీపంలో వాహనాలను కోసిగి ఎస్ఐ చంద్రమోహన్‌లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల అనుమతులు, పర్మిట్లు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్లను పరిశీలించారు. ఇందులో ఏ ఒక్కటి లేకున్నా జరిమానా విధించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్స్ రూల్స్ పాటించాలని సూచించారు. ఏఎస్ఐ సూర్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న స్వామివారు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో వెలిసిన శివసాయి గణేష్ ఆలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సురేష్‌శాస్త్రి, జగదీష్‌స్వామి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి, విశేష పుష్పాలంకరణ చేసి పూజలు చేపట్టారు. వేడుకలకు రౌడుకుంది పీఠాధిపతి శివయోగిస్వామి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాల ధరించిన శివస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక భజనలు చేపట్టారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివస్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా రంగస్వామి మహారథోత్సవం

మహారథాన్ని లాగుతున్న భక్తులు



ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో రంగస్వామి మహారథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు భక్తులు పంచిపెట్టారు. సంప్రదాయం ప్రకారం సాయంత్రం రెడ్డిమాను బలరాముడి ఇంటి నుంచి పూర్ణకుంభం బయలుదేరి రథం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవంలో స్థానికులే కాక చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరుకు మరమ్మతులు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమేష్

కోసిగి: మండలపరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే బోరు శుక్రవారం మరమ్మతులకు గురైంది. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ శివలింగమ్మ స్పందించి శనివారం ఉదయం బోరు పైపులు తీయించి రిపేరు చేసి మోటార్‌ను తిరిగి అమర్చారు. ఒక్క రోజులో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్

మూగలదొడ్డి గ్రామంలో దోమలు వ్యాప్తి చెందకుండా గ్రామ సర్పంచ్ కె.శివ లింగమ్మ , వైఎస్సార్‌సీపీ నాయకుడు కె. సోమేష్ ఆధ్వర్యంలో శనివారం ఫాగింగ్ చేపట్టారు. గ్రామంలో దోమలు విపరీతంగా పెరిగి పోవడంతో విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో రెండు రోజుల పాటు గ్రామంలో ఫాగింగ్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు.

మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలి



మిరప పంటను చూపుతున్న సీపీఎం నాయకులు , రైతులు

పెద్దకడబూరు: పండు మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసు, సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పర ఈరన్న డిమండ్ చేశారు. మండల కేంద్రంలోని పొలాలలో ఆరబెట్టుకున్న మిర్చిని శనివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం పంటలు పండినా గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులపాలయ్యారని మండిపడ్డారు. గత సంవత్సరం కంటే మిరప సాగు విస్తీర్ణం తగ్గినా.. ధర మాత్రం రోజురోజుకు పతనం అవుతుందన్నారు. రూ. 35వేల నుంచి రూ. 40వేలు పలకాల్సిన ధర కేవలం రూ. 6వేల నుంచి రూ. 12వేలు పోతే రూ.లక్షలు పెట్టుబడులు పెట్టిన రైతులకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. మండలంలోని రైతులు కొంతమంది కూలీలకు కూడా రాదని పంటను పొలాల్లోనే వదిలి వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కనీస మద్దతు ధర ప్రకటించి మిరుప రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధితులకు సాయం అందజేస్తున్న శివస్వాములు

కోసిగి: మండల కేంద్రం కోసిగి కడపాళెం వీధిలో నివాసం ఉంటున్న కౌతాళం నాగరాజు, పార్వతి దంపతుల గుడిసె విద్యుత్ షాట్ షర్క్యూట్‌తో పూర్తి కాలిపోయి సర్వం కోల్పోయిన విషయం విధితమే. శనివారం బాధిత కుటుంబానికి కోసిగికు చెందిన శివస్వాములు 50 కేజీ బియ్యం, రూ.వెయ్యి నగదు, రెండు జతల దుస్తులు, దుప్పట్లు, వంట సామగ్రి, కిరాణ సరుకులు, పిల్లల పుస్తకాలు, పలకలు అందజేసి చేయూతనందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.